సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



పొరుగు జాలర్లతో తీవ్ర నష్టం

పొరుగు రాష్ట్ర జాలర్లు ఇక్కడ చేపల వేట సాగిస్తుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు చెందిన మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. 8లో



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,440
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,577
3 శాతం జీఎస్టీతో	రూ.5,744
నవర (8 గ్రా)	రూ.45,952

గరిష్టం/కనిష్టం
40.0 /26.7

వాతావరణం

గురువారం గాలిలో 53 శాతం తేమ ఉంది. శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. వడగాలులు వీచే అవకాశముంది.



న్యూస్‌రీల్

పది మూల్యాంకనం ఎలా జరుగుతోంది?

- కలెక్టర్ హరినారాయణన్ ఆరా



మూల్యాంకనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని పొదలకూరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకనాన్ని కలెక్టర్ హరినారాయణన్ గురువారం పరిశీలించారు. డీఈఓ గంగాభవానీతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ 26వ తేదీ వరకు జరుగుతుందని, 1,200 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని డీఈఓ తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు శుక్రవారం ఉదయం పది గంటల నుంచి నెల్లూరులోని జెడ్పీ కార్యాలయంలో జరుగుతాయని సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన మొత్తం సమావేశాలు నిర్వహిస్తామని, జిల్లా పరిషత్ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కార్పొరేట్ పాఠశాలల్లో 136 మందికి ప్రవేశం

నెల్లూరు(టౌన్): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం మేర ఉచితంగా ప్రవేశాలకు అవకాశం కల్పించారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో మొత్తం 136 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వారి వివరాలను https://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అల్లూరులో ఒకరు, అనంతసాగరం ముగ్గురు, బుచ్చిరెడ్డిపాళెంలో ఎనిమిది మంది, ఇందుకూరుపేటలో ఇద్దరు, జలదంకిలో ఇద్దరు, కందుకూరులో ఆరుగురు, కావలిలో 25 మంది, కొడవలూరులో ఐదుగురు, మనుబోలులో ఒకరు, నెల్లూరులో 71 మంది, పొదలకూరులో ముగ్గురు, తోటపల్లిగూడూరులో ఒకరు, వెంకటాచలంలో ఇద్దరు, విడవలూరులో ఒకరు, వింజమూరు ఐదుగురికి ప్రవేశం కల్పించారు. వీరంతా ఈనెల 25వ తేదీలోపు ఆయా పాఠశాలల్లో చేరేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని డీఈఓ గంగాభవాని, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి గురువారం తెలిపారు.

పంచేడులో సాగులో ఉన్న వేరుశనగ పంట



వేరుశనగ పంట సాగు రైతులకు లాభాలు తెచ్చిపెడుతోంది. కాలం కలిసి రావడంతో ఈ సంవత్సరం కూడా దిగుబడులు పెరుగుతున్నాయి. ప్రభుత్వం కూడా రైతులకు రాయితీలు అందించి అండగా నిలిచింది. ఇతర జిల్లాలకు చెందిన రైతులు ఇక్కడి తీర ప్రాంతాల్లో పొలాలను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న పరిస్థితి ఉంది.

వేరుశనగ.. బాగా పండింది

గరిష్ట స్థాయికి ధరలు

- జిల్లాలో ముమ్మరంగా సాగు
- రాయితీలిచ్చి అండగా నిలిచిన ప్రభుత్వం
- అకాల వర్షంతో కొంత తగ్గిన ధరలు
- రైతులకు సబ్సిడీపై విత్తనాల అందజేత

బుచ్చిరెడ్డిపాళెం: జిల్లాలో వేరుశనగ సాగు ముమ్మరంగా జరుగుతోంది. బుచ్చిరెడ్డిపాళెం, దగదర్తి, దుత్తలూరు, ఉదయగిరి, పొదలకూరు తదితర మండలాలు, విడవలూరు, ఇందుకూరుపేట, కావలి, బోగోలు తదితర తీర మండలాల్లో బిందు సేద్యం ద్వారా సాగు జరుగుతుండగా రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ట్యాగ్–24, కే–6 రకాలను అధికంగా వేస్తున్నారు. ఈ రబీలో పండించిన పంటకు మార్కెట్‌లో గరిష్ట స్థాయిలో ధర పలుకుతోంది. విడవలూరు మండలంలోని తీర ప్రాంతం వేరుశనగ పంట సాగుకు చాలా అనుకూలం. దీంతో ఇతర జిల్లాలకు చెందిన రైతులు సైతం ఇక్కడ పొలాలను కౌలుకు తీసుకుని పంట వేస్తున్నారు. ప్రస్తుతం సుమారు 2,200 ఎకరాల్లో పంట ఉంది.

సాగు, ధరలు ఇలా..

పంట కాలవ్యవధి 120 నుంచి 140 రోజులు. పెట్టుబడి ఎకరాకు రూ.50 వేలు. ప్రస్తుతం జిల్లాలో పంట పీకుడు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరాకు 40 కేజీల బస్తాలు సరాసరిన 40 నుంచి 45 వరకు వస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే దిగుబడి కూడా అనుకున్న దానికంటే అధికంగా ఉంది. మార్కెట్‌లో 40 కేజీల బస్తా గరిష్టంగా రూ.3,300 పలుకుతోంది. గత సంవత్సరం ధర రూ.3,200. ఎన్నడూ లేని విధంగా ధరలు పలుకుతుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట అమ్ముడయ్యాక ఎకరాకు రైతుకు రూ.1,32,000 వస్తోంది. ప్రస్తుతం జిల్లా నుంచి కర్ణాటక, హైదరాబాద్, చెన్నై వ్యాపారులకు పంటను విక్రయిస్తున్నారు.

కౌలు రైతులకు ఊరట

తీర ప్రాంతాలు వేరుశనగకు అనుకూలం కావడంతో ప్రకాశం జిల్లాకు చెందిన రైతులు జిల్లాలోని విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు తదితర ప్రాంతాల్లో పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి అవుతుంది. అలాగే ఎకరాకు కౌలు రూ.25 వేలు చెల్లించాల్సి ఉంటుంది. రైతు రూ.75 వేలు ఖర్చు పెడితే కోతలు పూర్తయ్యాక సుమారు రూ.1,32,000 వస్తోంది. దీంతో అనేకమంది కౌలు రైతులు వేరుశనగ సాగుకు శ్రీకారం చుట్టారు.

జిల్లాలో..

వేరుశనగ సాగు విస్తీర్ణం :	14,600 ఎకరాలు
రైతుల సంఖ్య :	2,100
సాగు చేస్తున్న మండలాలు:	27
ప్రస్తుతం 40 కేజీల బస్తా ధర :	రూ.3,300

ప్రభుత్వ రాయితీలు

వేరుశనగ పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వ రాయితీలు అండగా నిలిచాయి. ముఖ్యంగా బిందు సేద్యం ద్వారా సాగు చేసే వారికి భరోసా కల్పిస్తోంది. ఎకరాకు రూ.80 వేల వరకు ఖర్చయ్యే బిందు సేద్యం పరికరాలను ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీపై, మిగిలిన వారికి 60 శాతం రాయితీపై ఇస్తోంది. అలాగే డ్రిప్ పరికరాలను కూడా అన్ని వర్గాల వారికి 80 శాతం రాయితీపై అందిస్తోంది. దీంతోపాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో ఎరువులు, పురుగుమందును ఇస్తోంది.

అకాల వర్షాలతో..

మార్చి చివరి మాసంలో కురిసిన అకాల వర్షాలు వేరుశనగ రైతుల పాలిట శాపంగా మారాయి. అప్పటి వరకు మార్కెట్‌లో 40 కేజీల బస్తా రూ.4 వేల వరకు ధర ఉండగా వర్షాలు కారణంగా రూ.3,300కు చేరింది. అంతే కాకుండా రైతులు చాలాచోట్ల పంటను నష్టపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వారికి 80 రాయితీపై కే–6 రకానికి చెందిన వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసి ఆదుకుంది.



కాయలను వేరుచేస్తున్న యంత్రం



విక్రయానికి సిద్ధంగా ఉన్న వేరుశనక్కాయలు

మార్కెట్‌లో ధర బాగుంది



ప్రస్తుతం మార్కెట్‌లో వేరుశనగకు మంచి ధర ఉంది. గత సంవత్సరం నుంచి మంచి ధర ఉండడం తోపాటు డిమాండ్ బాగుంది. మార్చి నెలాఖరు వరకు రూ.4 వేల ధర ఉండగా అకాల వర్షాల కారణంగా కాస్త తగ్గింది. అయినా కూడా రైతులకు మేలు జరుగుతోంది.

– ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైతు, వీరారెడ్డిపాళెం

జాగ్రత్తలు చెబుతున్నాం



వేరుశనగ పంటలో నూనెశాతం పెరిగే విధంగా ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించాలని క్షేత్రస్థాయి వ్యవసాయాధికారులకు చెబుతున్నాం. అంతే కాకుండా పంటలో వచ్చే తెగుళ్లు, పురుగులను గుర్తించి వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరిస్తున్నాం. ప్ర స్తుతం జిల్లాలో వేరుశనగ పంటకు మంచి డిమాండ్‌తోపాటు ధర కూడా అనుకూలంగా ఉంది.

– నర్సోజీ, ఏడీ, జేడీ కార్యాలయం

సిరులు కురిపిస్తోంది



గత సంవత్సరం నుంచి వేరుశనగ పంట సిరులు కురిపిస్తోంది. ముఖ్యంగా మార్కెట్‌లో ధర ఉండడంతోపాటు ప్రభుత్వ రాయితీలు కూడా కలిసి రావడం సంతోషానిస్తోంది. నిత్యం వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండి జాగ్రత్తలు చెబుతున్నారు.

– ఎస్.ఉదయ్‌భాస్కర్, రైతు, రామతీర్థం

ఎవరికి వారే..

- టీడీపీలో వేరుకుంపట్లు
- చంద్రబాబు పుట్టినరోజు నాడు గిరిధర్‌రెడ్డి హడావుడి
- పోటాపోటీగా కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: అందరూ అనుకుందే జరుగుతోంది. టీడీపీలో వేరుకుంపట్లు అధికమయ్యాయి. నెల్లూరు రూరల్‌కు చెందిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఎంట్రీతోనే ఆ పార్టీలో వర్గ రాజకీయాలు కొత్త మలుపు తీసుకున్నాయి. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా జరిగిన కార్యక్రమాలు సర్వత్రా చర్చకు దారి తీశాయి. సీనియర్ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, బీద రవిచంద్ర, అబ్దుల్ అజీజ్, మరికొందరు పార్టీ కార్యాలయంలోనే గురువారం వేడుకలు చేశారు. కొత్తగా పార్టీలో చేరిన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సారథ్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కార్యక్రమాలు జరిగాయి. ఇటీవల యువనేత వర్గంగా తెరపైకి వచ్చిన నేతలు దీనికి హాజరవడం కార్యకర్తలను షాక్‌కు గురి చేసింది.

చర్చనీయాంశంగా..

నిన్నమొన్నటి వరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి రూరల్ నియోజకవర్గ పరిధిలో దోపిడీ చేస్తున్నారని కోటంరెడ్డి మాఫియా అంటూ ప్రెస్‌మీట్లలో వ్యంగ్యంగా తిట్టిపోసిన టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అదే మాఫియా అడ్డాలో జరిగిన రక్తదాన శిబిరానికి ముఖ్యఅతిథిగా వెళ్లారు. దీంతో నాయకులు, కార్యకర్తలు నోరెళ్లబెట్టారు. టీడీపీ నుంచి సస్పెన్షన్‌కు గురైన నేత కిలారి వెంకటస్వామి నాయుడు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా వెళ్లడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డాడంటూ ఆయన్ను సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి కార్యక్రమాలకు దూరంగా ఉన్న కిలారిని గిరిధర్‌రెడ్డి ఆహ్వానించడం పార్టీనే ధిక్కరించినట్లు అవుతుందని సీనియర్ నేతలు మండిపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆనంతోపాటు కిలారి, అబ్దుల్ అజీజ్ లోపాయికారి ఒప్పందాలతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేకు సహకరించారని అప్పట్లో టీడీపీ నాయకులు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో అంతర్గత విచారణ జరిపి కిలారిని సస్పెండ్ చేశారు. వెంకటరమణారెడ్డి, అజీజ్‌కు మొట్టికాయలు వేసినట్లు ప్రచారం జరిగింది.



కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న గిరిధర్‌రెడ్డి, పట్టాభి, వెంకటరమణారెడ్డి, కిలారి

యువనేత టీం

ప్రస్తుతం జిల్లా టీడీపీలో రెండు వర్గాలున్నాయి. చంద్రబాబు, లోకేశ్ వర్గాలుగా నేతలు చెలామణి అవుతున్నారు. నిన్నమొన్నటి వరకు పెత్తనమంతా సోమిరెడ్డి, బీద రవిచంద్ర చేసేవారు. తాజాగా యువనేత వర్గంగా మాజీ మంత్రి నారాయణ ముఖ్య అనుచరుడు పట్టాభి తెరపైకి వచ్చారు. పార్టీలో జరిగే వ్యవహారాలు ఎప్పటికప్పుడు తనకు అనుకూలంగా మార్చుకుంటూ లోకేశ్‌కు దగ్గరయ్యాడనే ప్రచారం ఉంది. గిరిధర్‌రెడ్డి ఎంట్రీకి లోకేశ్ రాయబారాలు జరిపి గ్రీన్‌సిగ్నల్ ఇప్పించాడని చెబుతుంటారు. ఈ క్రమంలో కోటంరెడ్డి, పట్టాభి, ఆనం, కిలారి కలవడం ప్రస్తుతం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. నేతలంతా ఒకేచోట చేరి కార్యక్రమాలు చేయకుండా వేరు కుంపట్లు పెట్టి పార్టీని బజారున పెట్టేశారంటూ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణలో జాప్యం చేస్తే సహించం

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(అర్బన్): జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో జాప్యం చేస్తే సహించేది లేదని కలెక్టర్ హరినారాయణన్ హెచ్చరించారు. భూసేకరణ ప్రక్రియపై ఇరిగేషన్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో గురువారం నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లోని రైతులతో సమావేశాలు జరిపి ప్రాజెక్ట్‌ల వల్ల వచ్చే ఉపయోగాలను వివరించాలన్నారు. అవసరమైతే స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి రైతులను భూసేకరణకు ఒప్పించాలన్నారు. ఈ ప్రక్రియ ఆలస్యమైతే రైతులే నష్టపోతారని ఈ విషయాన్ని వారికి అర్థమయ్యేలా వివరించాలని ఆదేశించారు. ప్రాజెక్ట్‌ల పరిధిలోని డీకేటీ భూములు, చుక్కల భూములు తదితర వాటి గురించి కూడా పరిశీలించి రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో జేసీ కూర్మనాథ్, తెలుగుగంగ ప్రాజెక్ట్ సీఈ హరినారాయణరెడ్డి, సోమశిల ప్రాజెక్ట్ ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, ఎస్‌డీసీలు పాల్గొన్నారు.

సోమశిలలో 52.243 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో గురువారం నాటికి 52.135 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 295 క్యూసెక్కుల వంతున వరద వచ్చి చేరుతోంది. పెన్నార్ డెల్టాకు 150, ఉత్తరకాలువ కు 400, దక్షిణకాలువకు 50, కండలేరుకు 300 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జలాశయంలో 96.692 మీటర్ల నీటి మట్టం ఉంది.

ముస్లింలకు అండగా ప్రభుత్వం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- ప్రభుత్వ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నెల్లూరు(సెంట్రల్): ముస్లింలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్‌తో కలిసి మంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఉంటారన్నారు. ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, మాలెం సుధీర్‌కుమార్ రెడ్డి, పలువురు అధికారులు, నాయకులు, మతపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న మంత్రి కాకాణి, ఎంపీ ఆదాల, కలెక్టర్ హరినారాయణన్

12 మంది ఎంపీడీఓలకు మెమోలు

నెల్లూరు(పొగతోట): కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు జిల్లాలోని 12 మంది ఎంపీడీఓలకు మెమోలు జారీ చేశామని జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు, దుత్తలూరు, చేజర్ల, సంగం, విడవలూరు, కందుకూరు, బోగోలు, లింగసముద్రం, ముత్తుకూరు, మర్రిపాడు, సీతారామపురం, సైదాపురం మండలాల్లోని సచివాలయాల్లో సిబ్బంది హాజరు 80 శాతం కన్నా తక్కువగా ఉందన్నారు. దీంతో ఆయా మండలాల ఎంపీడీఓల పర్యవేక్షణ లోపం ఉన్నట్లు గుర్తించి వారికి మెమోలు ఇచ్చినట్లు సీఈఓ వెల్లడించారు. సచివాలయాల్లో ఉద్యోగులు, వలంటీర్లు హాజరు వందశాతం ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

క్లుప్తంగా

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

పొదలకూరు : మండలంలోని ఉలవరపల్లిలో ఈనెల 16వ తేదీన విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందగా, దీనిపై అనుమానాలు ఉన్నాయని మృతుడి భార్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై ఎస్కే కరిముల్లా కథనం మేరకు.. గ్రామానికి చెందిన పులిపాటి రమణయ్య(47) పొలాల వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందారు. కుటుంబసభ్యులు రమణయ్య కోసం గాలించి మృతదేహాన్ని గుర్తించి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే మృతదేహం పడి ఉన్న స్థితి తదితర కారణాలను దృష్టిలో ఉంచుకుని తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని కల్పన రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో జీజీహెచ్ నుంచి హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీనారాయణను మృతదేహాన్ని పూడ్చిన వద్దకు రప్పించి పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామంలో ప్రాథమికంగా విచారణ కూడా నిర్వహించారు.

భూ మార్పిడిలో జాప్యం

- పెండింగ్‌లో భారీగా దరఖాస్తులు
- దరఖాస్తులు 4,860
- అనుమతి 1,872కు మాత్రమే



కందుకూరు మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ భూమిలో వేసిన లేఅవుట్

కందుకూరు : జిల్లాలో ల్యాండ్ కన్వర్షన్ (వ్యవసాయ భూములు వ్యవసాయేతరానికి) దరఖాస్తులు భారీగా పెండింగ్‌లో ఉంటున్నాయి. మొత్తం నాలుగు రెవెన్యూ డివిజన్లలో ఈనెల 12 వరకు 4,860 మంది ల్యాండ్ కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం 1,872 దరఖాస్తులకు మాత్రమే అధికారులు ఆమోదం తెలిపారు. మిగిలినవన్నీ నెలల తరబడి అధికారుల వద్దే పెండింగ్‌లో ఉంటున్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

వ్యవసాయ భూములను ఇతర ఉపయోగాలకు (కమర్షియల్ పర్పస్) వినియోగించాలంటే కచ్చితంగా ఆ భూమిని వ్యవసాయేతరగా మార్పిడి చేయాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి నెల్లూరు, కందుకూరు, కావలి, ఆత్మకూరు డివిజన్లలో 4,860 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో అత్యధికంగా నెల్లూరు డివిజన్‌లో 2,836 ఉండగా, కావలి డివిజన్లో 1,162, కందుకూరు డివిజన్‌లో 517, ఆత్మకూరు డివిజన్‌లో అతితక్కువగా 345 వచ్చాయి. మొదటిగా ఆర్డీఓ స్థాయిలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తులను తహసీల్దార్ క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆ రిపోర్టును ఆర్డీఓకి సమర్పించాల్సి ఉంది. అయితే వీటిలో 2,231 వాటిపై మాత్రమే తహసీల్దార్‌లు రిపోర్టు తయారు చేసి పంపారు. వీటిలో 1,872 దరఖాస్తులను ఆర్డీఓలు ఆమోదం తెలపగా, 359 దరఖాస్తులను తిరస్కరించారు. ఆమోదించిన వాటిలో 1,785 దరఖాస్తులకు సంబంధించిన వ్యవసాయ భూమి నుంచి వ్యవసాయేతరగా మార్చి రికార్డుల్లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ల వద్దే 54.09 శాతం పెండింగ్‌లో ఉన్నాయి. వ్యవసాయభూమిని వ్యవసాయయేతరగా మార్చాలంటే సదరు భూమి రిజిస్ట్రేషన్ విలువలో 3 శాతం రెవెన్యూ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ కాలంలో ఇది దాదాపు 9 శాతం వరకు ఉంది. భూయజమానులకు ఇది భారంగా మారడంతో ప్రస్తుత ప్రభుత్వం 3 శాతానికి తగ్గించింది. దీంతో అన్నివర్గాల ప్రజలకు ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు అందుబాటులోకి వచ్చాయి. కానీ రెవెన్యూ అధికారులు దీన్ని సక్రమంగా అమలు చేయకపోవడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇష్టారీతిన

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో వ్యవసాయ భూములకు ఎటువంటి అనుమతి లేకుండా కొందరు వ్యవసాయేతర భూములుగా మార్చేస్తున్నారు. వీరిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ముందు వరుసలో ఉన్నారు. వ్యవసాయ భూముల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. కందుకూరు పట్టణంలో ఇటీవల వెలిసిన లేఅవుట్ ఇందుకు నిదర్శనం. 60 అడుగుల రోడ్డు, పోతురాజుమిట్ట, మహదేవపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో పదుల ఎకరాల్లో అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేశారు. ఇందుకు కచ్చితంగా భూ స్వభావాన్ని మార్చడంతో పాటు, నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి అనుమతులు తీసుకోవాలి. అయితే ఏమీ లేకుండానే లేఅవుట్‌లు వేయడం వల్ల అటు రెవెన్యూకు, ఇటు మున్సిపాలిటీకి రావాల్సిన రాబడిని కోల్పోవాల్సి వస్తోంది. పైగా ఎలాంటి మౌలిక వసతులు లేకుండా వేసిన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలు తరువాత అనుమతుల పేరుతో పెద్ద ఎత్తున జరిమానాల రూపంలో పన్నులు కట్టాల్సి వస్తోంది.

యజమానికి తెలియకుండానే రిజిస్ట్రేషన్

- కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో హైటెక్ మోసం
- ఐరిష్, వేలిముద్రలు దుర్వినియోగం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

కావలి : కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీవినీ ఎరుగని రీతీలో హైటెక్ మోసం వెలుగుచూసింది. పొలం యజమానికి తెలియకుండానే అతని భూమిని లేఅవుట్‌లు చేసి ఇతరులకు విక్రయించిన ఘటన అధికార వర్గాల్లో కలకలం రేపింది. రిజిస్ట్రేషన్ కోసం బాధితుడి ఫొటోలు, వేలిముద్రలు, ఐరిష్ వినియోగించడం ఇక్కడ అంతు చిక్కని విషయంగా మారింది. బాధితుడు కాసుల బాదుల్లా పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు.. కొండాపురం మండలం కొమ్మికి చెందిన కాసుల బాదుల్లాకు మద్దూరుపాడులోని సర్వే నంబర్ 214లో 3.96 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని 2010లో కొనుగోలు చేశాడు. ఇటీవల కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు తన భూమి ఫొటోలు, సర్వే నంబర్లతో ప్లాట్లు విక్రయిస్తున్నట్లు తెలుసుకుని ఖంగుతిన్నాడు. ఈ విషయంపై గురువారం కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఆరా తీయగా కళ్లు చెదిరే వాస్తవాలు వెలుగు చూశాయి. గత ఫిబ్రవరి 15వ తేదీన గుర్తుతెలియని వ్యక్తి పొలం యజమాని ఆధార్‌కార్డు, ఇంటి అడ్రస్‌లు ఇచ్చి ఫొటో, ఐరిష్, వేలిముద్రలతో 100 అంకణాల భూమిని 30, 35, 35 అంకణాలతో మూడు ప్లాట్లుగా ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసినట్లు గుర్తించాడు. గుడ్లూరు మండలానికి చెందిన ఇద్దరికి, అల్లూరు మండలం ఇస్కపల్లికి చెందిన ఒకరికి ప్లాట్లు అమ్మినట్లుగా గుర్తించాడు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లు కుమ్మక్కై అక్రమ రిజిస్ట్రేషన్ చేసినట్లుగా ఆరోపిస్తూ కావలి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రెమ్యూనరేషన్ పెంపుపై ధన్యవాదాలు

నెల్లూరు (టౌన్) : పదో తరగతి మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను పేపర్‌కు రూ.10కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల తాడేపల్లిలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు చంద్రశేఖరరెడ్డి, కల్పలతారెడ్డి కలిసి పది మూల్యాంకనం రెమ్యూనరేషన్‌ను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత మూల్యాంకనం రెమ్యూనరేషన్ పేపర్‌కు రూ.6.60 ఉండగా, పెంచిన దాని ప్రకారం రూ.10 ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి పక్కాగా అమలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నెల్లూరు (అర్బన్) : సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పక్కాగా, పారదర్శకంగా అమలు జరగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. వెలగపూడి సచివాలయం నుంచి అభివృద్ధి, సంక్షేమం, ఇతర ప్రాధాన్యత కార్యక్రమాల అమలు పురోగతిపై గురువారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మట్, ఇన్‌చార్జి డీఆర్వో పద్మావతి తదితరులు కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించిన దానికి సమాధానంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. మొదటిదశ కింద చేపట్టిన రీసర్వే ప్రక్రియలో రాళ్లు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నామన్నారు. స్పందన అర్జీలను సంతృప్తికరంగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఆర్బీకేలు, వ్యవసాయ అధికారుల ద్వారా రైతులకు అండగా ఉన్నామన్నారు. జిల్లాలో మల్టీ పర్పస్ ఫెసిలిటీ గోడౌన్‌ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. నవరత్నాలు, ఇళ్లు, తాగునీటి వసతి, విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీ, హార్టికల్చర్, రహదారుల భూ సేకరణ తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, సీపీఓ రాజు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ హనుమాన్‌ప్రసాద్, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



రెస్క్యూ పరికరాల పనితీరుపై డెమో ఇస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్) : అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రైల్వేఫీడర్స్‌రోడ్డులోని అగ్నిమాపక కేంద్ర ఆవరణలో లెండి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అగ్నిప్రమాద నివారణ చర్యలు, రెస్క్యూ ఎక్విప్‌మెంట్, ప్రమాద సమయంలో సిబ్బంది పనితీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే అగ్నిప్రమాదాలు ఎలా సంభవిస్తాయి? ప్రమాద నివారణ చర్యలు? తనను తాను రక్షించుకుంటూ ఇతరులను ఎలా రక్షించుకోవాలి? తదితరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా అన్ని అగ్నిమాపక కేంద్రాల పరిధిలో పరిశ్రమలు, అపార్ట్‌మెంట్‌లు, విద్యాసంస్థలు, షాపింగ్‌మాల్స్, హాస్పిటల్స్, సినిమా థియేటర్‌లు, పెట్రోల్ బంకులు, గోదాములు తదితరాల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు ప్రధాన కూడళ్లు, రైల్వేస్టేషన్‌లు, బస్టాండ్‌ల్లో కరపత్రాలు పంపిణీ చేశామన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో డెమో ద్వారా వివరించామన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే 101కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో నెల్లూరు అగ్నిమాపక కేంద్ర అధికారి జాషువా, లెండీ కళాశాల ప్రతినిధి శశికాంత్‌రెడ్డి, అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొరుగు జాలర్లతో తీవ్ర నష్టం

- మూడు జిల్లాల మత్స్యకారుల ఆవేదన



సమావేశంలో పాల్గొన్న మత్స్యకార కాపులు, నేతలు

అల్లూరు : పొరుగు రాష్ట్ర జాలర్లు ఇక్కడ చేపల వేట సాగిస్తుండడంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని మూడు జిల్లాలకు చెందిన మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్లూరు మండల పరిధిలోని ఇస్కపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నెల్లూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలోని 120 గ్రామాల నుంచి దాదాపు వెయ్యి మంది మత్స్యకారులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన కడలూరు, కారైకల్ బోట్లు నిత్యం తమ తీరాల వెంబడి వేట సాగించడంతో నష్టపోతున్నామని, దీనిపై ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారన్నారు. వారి హైస్పీడ్ బోట్లను అడ్డుకోవాలంటే ఒకటి లేదా రెండు పెద్ద బోట్లను కొనుగోలు చేయాలని, వాటి ఖరీదు దాదాపు రూ.కోటి వరకు ఉంటుందన్నారు. దీనికి మత్స్యకారులందరూ తమ సహాయ సహకారాలు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కపల్లి పెదకాపు తోటయ్య, చినకాపు చిన పార్వతయ్య, గ్రామ కాపు శీనయ్య పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

అనుమసముద్రంపేట : మండలంలోని చిరమన గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా పీడీ వెంకట్రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు గిట్టుబాటు అయ్యేలా కనీసం రూ.272 వచ్చేలా పనిచేయాలని తెలిపారు. పని జరిగే ప్రాంతంలో తాగునీటి సౌకర్యం కల్పించేలా అధికారులు చొరవ చూపాలని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ భాస్కర్, శంకరనారాయణ, నవీన్ తదితరులు ఉన్నారు.

పూర్తి వివరాలు నమోదు చేయాలి

ఆత్మకూరు : పొదుపు గ్రూపు సభ్యుల పూర్తి వివరాలను ఎస్ఎల్ఆర్ఎం లోకో అనే ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుందని శిక్షకులు పేర్కొన్నారు. పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు చెందిన పొదుపు ఏపీఎంలు, సీసీలు, వీఓఏలకు గురువారం రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యాప్ గురించి, నమోదు చేయాల్సిన విధానం గురించి వివరించారు. యాప్‌లో నమోదైన వారికి మాత్రమే రుణాల మంజూరు, పొదుపు ఖాతాల లావాదేవీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఉదయగిరి ఏసీ జి.శేషారెడ్డి, డీఆర్‌డీఏ నుంచి శిక్షకులు బి.చిన్నయ్య, కాంతారావు, మోహన్‌రావు, హరి, మస్తానమ్మ, వెంకట రమణమ్మ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.75
సన్నవి : రూ.50
పండ్లు : రూ.30



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	125
లేయర్ (లైవ్) :	75
బ్రాయిలర్ చికెన్ :	218
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	242
లేయర్ చికెన్ :	128

